

యాదగిరిగుట్టలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## బీసీ రిజర్వేషన్లు 60 శాతం అమలు చేయాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : జనాభా దామాషా ప్రకారం బీసీలకు 60 శాతం రిజర్వేషన్ అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కుటుంబ సమేతంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. హైకోర్టుకు వెళ్లి రిజర్వేషన్లు నిలుపుదల చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు అనుమానాలు వస్తున్నాయని తెలిపారు. కోర్టులో కేసులు ఉన్నాయని తప్పించుకునే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వంద శాతం రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వామివారిపై ఒట్టువేసి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. వందశాతం రుణమాఫీ అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు గ్రామాల్లో 10 శాతం మాత్రమే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రైతుభరోసా పేరిట రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని విమర్శించారు. రైతులకు ఇప్పటివరకు రూపాయి కూడా రైతుబంధు ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. దేవుడి దగ్గర వివక్ష ఉండకూడదని, యాదగిరిగుట్టకు రూపాయి కూడా కేటాయించకపోవడం సరికాదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్నెంకొండ ఆలయం వద్ద రోప్‌వే, సకల వసతులు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కారు రేస్ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసే కుట్ర చేస్తుందని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. కారు రేస్ వ్యవహారంలో అసెంబ్లీలో చర్చించే దమ్ములేక సర్కార్ తోకముడిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సినీ నటుడు అల్లు అర్జున్‌పై కక్షసాధింపు చర్యలకు పూనుకున్నదని ఆరోపించారు. సంధ్య థియేటర్ ఘటనపై పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సినిమా ఇండస్ట్రీని ఆంధ్రాకు తరలించే ప్రయత్నంలో ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఏ చిన్న పరిశ్రమ తరలిపోయినా ఊరుకోబోమని హెచ్చరించారు.



మచ్చర్ల లిఫ్ట్ ఎత్తిపోతల పథకం పనుల కోసం తెచ్చిన పైపులను చూపిస్తున్న జీవన్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ హయాంలోనే లిఫ్టుల మంజూరు

- కాంగ్రెస్, బీజేపీ చేసింది శూన్యం
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్, డిసెంబర్ 25: బీఆర్‌ఎస్ హయాంలోనే ఎత్తిపోతల పథకాలను మంజూరు చేశామని, రైతుల చిరకాల వాంఛ మచ్చర్ల లిఫ్ట్ కేసీఆర్ గిఫ్ట్ అని బీఆర్‌ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మచ్చర్ల లిఫ్ట్ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మంజూరైన మూడు కొత్త లిఫ్టులు బీఆర్‌ఎస్ ఇచ్చినవేనని స్పష్టం చేశారు. మచ్చర్ల, జోర్ద్‌పూర్, ఖుద్వాన్‌పూర్ రైతులకు చెందిన 2,860 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చేందుకు మచ్చర్ల ఎత్తిపోతల పథకానికి రూ.40 కోట్లు, ఫత్తేపూర్, చేపూర్, సుర్బిర్యాల్ ఎత్తిపోతల పథకానికి రూ.110 కోట్లు, చిక్లీ-గుంజిలి లిఫ్ట్‌కు రూ.89 కోట్లను తానే మంజూరు చేయించానని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ ఆర్మూర్ పాలిట అష్టదరిద్రాలుగా మారాయని మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే తెచ్చిన నిధులు నిల్, కాంగ్రెస్ నేత అవినీతి ఫుల్, ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి కిల్ అని ధ్వజమెత్తారు.

# జైల్లో పెట్టించి సీఎం పైశాచికానందం

- లగచర్ల ఘటనలో నాపై తప్పుడు కేసు
- వారెంట్ లేకుండానే అరెస్ట్ చేశారు
- పైనుంచి ఆదేశాలతోనే అరెస్ట్
- ఏ తప్పూ లేకున్నా 37 రోజులు జైలు
- కేటీఆర్ చెప్తే నేను దాడిచేయించినట్టు ఎఫ్‌ఐఆర్
- కేసులో కేటీఆర్‌నూ ఇరికించే కుట్ర
- కేటీఆర్‌ను జైలుకు పంపాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచన
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 25 : లగచర్ల ఘటనలో సీఎం రేవంత్‌రెడ్డి తనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపించారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చెప్పారు. 37 రోజులు తనను జైలులో పెట్టి సీఎం పైశాచికానందం పొందారని మండిపడ్డారు. ఈ కేసులో కేటీఆర్‌ను కూడా ఇరికించే ప్రయత్నం చేశారని తెలిపారు. ప్రజల తరపున పోరాడుతున్న కేటీఆర్‌ను ఎలాగైనా జైలుకు పంపాలని సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిగిలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనను ఎలాంటి వారెంట్ లేకుండా, ఎఫ్‌ఐఆర్‌లో పేరు లేకుండా, ఉదయం వాకింగ్ చేస్తున్న సమయంలో ఒక రౌడీని, దొంగను అరెస్టు చేసినట్టు తీసుకువెళ్లి డీటీసీ సెంటర్‌లో పెట్టారని నిప్పులుచెరిగారు. డీటీసీ నుంచి పరిగికి తీసుకొచ్చి, అక్కడి నుంచి 4 గంటల ప్రాంతంలో కొడంగల్ దవాఖానకు తీసుకెళ్లారని, అప్పటివరకు ఎఫ్‌ఐఆర్‌లో తన పేరు లేదని వివరించారు. అప్పటికే సురేశ్ పేరు ఏ1గా పెట్టి రిమాండ్ రిపోర్ట్ తయారు చేశారని, తనను దవాఖానకు తీసుకువెళ్లిన తర్వాత ఎఫ్‌ఐఆర్‌లో పేరు చేర్చారని, రిమాండ్ రిపోర్ట్ చదవనీయకుండా తన సంతకం తీసుకున్నారని చెప్పారు. '10 నిమిషాల్లో జడ్జి ముందుకు వెళ్లాలి, జడ్జి వెళ్లిపోతారని తొందర పెట్టి దవాఖానలో తన సంతకం తీసుకొని జడ్జి ముందు హాజరు పరిచారు. కేటీఆర్ చెప్పినందుకే తాను దాడి చేయించినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో ఉన్నదని పత్రికల ద్వారా, మా కుటుంబసభ్యులు ములాఖత్‌కు వచ్చినప్పుడు తెలుసుకొని షాక్‌కు గురైన. ఎఫ్‌ఐఆర్ కాపీ, రిమాండ్ రిపోర్ట్ చదివే అవకాశం ఇవ్వకుండా, న్యాయవాదులకు ఇవ్వకుండా పది నిమిషాల్లోనే మీ ముందు హాజరు పరిచారు అని జైలు నుంచే జడ్జికి లేఖ రాసిన' అని వెల్లడించారు. తప్పుడు రిమాండ్ రిపోర్ట్ ఉన్నదని లేఖ రాస్తే జడ్జి ఆమోదించారని తెలిపారు. డీటీసీ సెంటర్‌లో ఐజీ, ఎస్పీ వచ్చారని, తనను ఎవరు ఏమీ అడగలేదని, వారెంట్ లేకుండా, ఎఫ్‌ఐఆర్‌లో పేరు లేకుండా ఎందుకు అరెస్టు చేశారని తాను ప్రశ్నిస్తే పై నుంచి ఆదేశాలు ఉన్నాయి, అరెస్టు చేశామని చెప్పారని వివరించారు. అక్రమంగా, రాజకీయ కక్షతో ఈ కేసు తనపై పెట్టి కేటీఆర్‌ను ఇరికించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెట్టి, నిర్బంధించి మాట్లాడకుండా ప్రజల తరపున పోరాటం చేయకుండా సీఎం చేసిన కుట్రలో భాగమని మండిపడ్డారు.

### ప్రజల దృష్టి మళ్లించేందుకే

అసెంబ్లీలో రైతుభరోసాపై విధివిధానాలు ప్రకటిస్తానని చెప్పారని, సంక్రాంతి నుంచి రైతుభరోసా ఇస్తామని ప్రకటించి అసెంబ్లీలో రైతుబంధుపై ప్రకటన చేయకుండా కేటీఆర్‌పై ఏసీబీ కేసు, సినీ నటుడు అల్లు అర్జున్‌పై కేసు పెట్టారని పట్నం విమర్శించారు. రోజుకో కేసు పెట్టి ప్రజల దృష్టి మరల్చేందుకు రేవంత్‌రెడ్డి కుయుక్తులు పన్నుతున్నాడని విమర్శించారు. ప్రజా సమస్యలు పక్కనబెట్టి అల్లు అర్జున్ అంశంపై గంటన్నరపాటు మాట్లాడాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు.

### ఇంత దిగజారుడు సీఎం ఇంకొకరు ఉండరు

రేవంత్‌రెడ్డి సీఎం అయితే తమ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని ఆశపడ్డ కొడంగల్ రైతులను అరెస్టు చేయించి బేడీలు వేయించారని పట్నం విమర్శించారు. జైలులో రైతుకు గుండెపోటు వచ్చినా అతడికి బేడీలు వేయించిన ఇంత దిగజారుడు ముఖ్యమంత్రిని ఎక్కడా చూడలేదని మండిపడ్డారు. గుండెపోటు వచ్చిన రైతుకు బేడీలు వేస్తే ఇంకా భయపడి చనిపోతే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. లగచర్ల దాడికి కారణం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం, పోలీసుల నిఘా వైఫల్యమేనని విమర్శించారు. ఘటనకు 15 రోజుల క్రితం అక్కడ ఒక దాడి జరిగిందని, సీఎం ప్రధాన అనుచరుడు శేఖర్‌ను రైతులు తీవ్రంగా కొట్టారని, అంత పెద్ద దాడి తర్వాత రెండోసారి పోలీసులు లేకుండా కలెక్టర్‌ను ఆ గ్రామానికి ఎలా పంపిస్తారని నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు.



## 'పచ్చని అడవి' స్ఫూర్తిదాయకం

- మాజీ మంత్రి జోగురామన్న అంకితభావానికి వందనాలు
- గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మాజీ మంత్రి జోగురామన్న పిచ్చిమొక్కల స్థానంలో పచ్చని అడవిని రూపొందించడం నిజంగా స్ఫూర్తిదాయకమని గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ అభినందించారు. 'పరివర్తనకు సాక్షి! మాజీ మంత్రి నేతృత్వంలోని ప్లాంటేషన్ చొరవకు ముందు, ఆ తర్వాత అద్భుతాన్ని చూడండి. పిచ్చిమొక్కలతో ఉన్న ప్రాంతంలో మొక్కలు నాటి పచ్చని అడవిని రూపొందించారు. నిజంగా స్ఫూర్తిదాయకం.. పచ్చని భవిష్యత్తు కోసం జోగురామన్న అంకితభావం, ధృక్పథానికి వందనాలు..' అంటూ ఎక్స్‌లో మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ జోగురామన్నను అభినందించారు.

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసుల నోటీసులు

- రేపు విచారణకు రావాలని ఆదేశం

బంజారాహిల్స్,డిసెంబర్ 25: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేస్తున్నారంటూ ఫిర్యాదు చేసేందుకు 20రోజుల క్రితం ఆయన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ జరిగిన గొడవ వ్యవహారంలో నమోదైన కేసులో ఈనెల 27న విచారణకు రావాలంటూ మాసాబ్‌ట్యాంక్ పోలీసులు 41(ఏ)నోటీసులు ఇచ్చారు. సంఘటనలో పాల్గొన్నవారి వివరాలు తీసుకోవడంతో పాటు ఇతర ఆధారాలు సేకరించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఘటనలో మరికొంత మందిని నిందితులుగా చేర్చాలని పోలీసు ఉన్నతాధికారులనుంచి ఆదేశాలు వచ్చినట్లు స మాచారం. కౌశిక్‌రెడ్డి వెంటవచ్చి న వారి వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల నిర్బంధం

- సీఎం పర్యటన నేపథ్యంలో మెదక్‌లో టెంట్ తొలగింపు
- రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ఉద్యోగుల తరలింపు
- సర్కార్ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు



పోలీసులు తొలగించిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె టెంట్

మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మెదక్ కలెక్టరేట్ ఎదుట గత 15 రోజులుగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన శిబిరాన్ని రూరల్ పోలీసులు బలవంతంగా తొలగించి, ఉద్యోగులను పోలీస్ స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. అయితే పోలీసుల తీరును నిరసిస్తూ ఉద్యోగులు స్టేషన్‌లోనే బైఠాయించి సర్కార్‌కు వ్యతిరేకంగా నినదించారు. ఈ ఘటనను సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. దౌర్జన్యంగా టెంట్ తొలగించి సమ్మెలో ఉన్న ఉద్యోగులను స్టేషన్‌లో నిర్బంధించడం దారుణమన్నారు. టెంట్లు పీకేసే బదులు వారి సమస్యకు పరిష్కారం చూపాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. 15 రోజులుగా ఆందోళన చేస్తున్న వారి ఆవేదన అర్థం చేసుకోవాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఛాయ్ తాగినంత సేపట్లో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు తీరుస్తామని, వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి, ఏడాది గడిచినా పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. అన్ని వర్గాలను మోసం చేస్తున్న విధంగానే సమగ్ర శిక్షా ఉద్యోగులను కూడా కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ నిర్బంధాలకు గురిచేస్తున్నారని, ఇది హేయమైన చర్య అని మండిపడ్డారు. నిర్బంధించిన సమగ్ర శిక్షా ఉద్యోగులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## సైబర్ సూచనలో తప్పును సవరించండి

- బీఎస్‌ఎన్‌ఎల్ సీజీఎంకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ లేఖ

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి ఫోన్లకు వస్తున్న సూచనలు పోలీసులు, జడ్జీలను కించపరిచేలా ఉన్నాయని మాజీ ఎంపీ వినోద్ కుమార్ చెప్పారు. ఎవరికైనా ఫోన్ చేసినప్పుడు రింగ్ అయ్యే ముందు వచ్చే సూచనలో 'మీకు పోలీసులు, జడ్జీలు వీడియో కాల్స్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడవచ్చు. అలాంటి కాల్స్ మీకేమైనా వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వండి' అని ఉన్నదని తెలిపారు. ఈ సూచనలో పోలీసులు, జడ్జీలే నేరుగా వీడియో కాల్ చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్టు తప్పుడు అర్థం వస్తున్నదని వినోద్ కుమార్ పేర్కొన్నారు. 'పోలీసులు, జడ్జీల పేరిట' అని రావాల్సిన సమాచారం తప్పుగా వస్తున్నదని వెల్లడించారు. ఈ తప్పును సవరించాలని బీఎస్‌ఎన్‌ఎల్ సీజీఎంకు బుధవారం లేఖ రాశారు.

# మంటగలిసిన మానవత్వం

### ఆస్తులు తీసుకొని పెద్దమ్మ మృతదేహాన్ని రోడ్డుపై వదిలేసిన కొడుకులు.. ప్రైవేట్ వ్యక్తులతో అంత్యక్రియలు

జగిత్యాల, డిసెంబర్ 25: ఆస్తులు పంచుకుని పెద్దమ్మ మృతదేహాన్ని రోడ్డుపై వదిలేసిన అమానవీయ ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాలలోని తీన్‌ఖనిలో సాదుల సత్తమ్మ (85)- లక్ష్మణ్ దంపతులు నివసించేవారు. సత్తమ్మ భర్త లక్ష్మణ్ 20 ఏండ్ల క్రితం మృతి చెందాడు. వీరికి సంతానం లేకపోవడంతో తన భర్త లక్ష్మణ్ తమ్ముడి కొడుకులైన ప్రసాద్, రవిని సత్తమ్మ చేరదీసి వారికి ఆస్తులు పంచి ఇచ్చింది. సత్తమ్మను వారిద్దరూ వంతులవారీగా పోషిస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో దవాఖానలో చేరిన ఆమె మంగళవారం రాత్రి మృతిచెందింది. దవాఖాన సిబ్బంది అంబులెన్స్‌లో మృతదేహాన్ని కాలనీకి తీసుకురాగా, ఇంట్లోకి తీసుకెళ్లేందుకు ఇద్దరు కొడుకులూ నిరాకరించారు. ఆరు గంటల పాటు మృతదేహం అంబులెన్స్‌లోనే ఉన్న విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సత్తమ్మ పాత ఇంటి తాళాలు పగులగొట్టి మృతదేహాన్ని లోపలికి తీసుకెళ్లారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు కొడుకులు ముందుకురాకపోవడంతో బుధవారం ప్రైవేట్ వ్యక్తులతో ఆఖరి మజిలీ నిర్వహించారు.








## రాష్ట్రంలో మరో కొత్తజాతి పక్షి

- భీమునిపాదం జలపాతం వద్ద కొరియన్ ఫ్లైక్యాచర్ గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ పక్షుల వైవిధ్యానికి నెలవుగా మారుతున్నది. ఇందుకు నిదర్శనంగా రాష్ట్రంలో మరో కొత్తజాతి పక్షి వెలుగుచూసింది. ప్రముఖ పక్షి పరిశీలకుడు హరిగోపాల్ శ్రీరంగం.. మహబూబాబాద్ జిల్లాలోని భీమునిపాదం జలపాతం వద్ద ఏప్రిల్ 23న పసుపువర్ణంతో కూడిన ఓ పక్షిని చూశాడు. అది అరుదైన పక్షి కావడంతో దాని ఫొటోను ఈ-బర్డ్ డాటాబేస్‌లో అప్‌లోడ్ చేశాడు. గమనించిన నిపుణులు దానిని కొరియన్ ఫ్లైక్యాచర్‌గా గుర్తించారు. దీంతో దానిని రాష్ట్రంలో 445వ పక్షిజాతిగా నమోదుచేశారు. ఈ సందర్భంగా హరిగోపాల్ మాట్లాడుతూ.. ఈ ఫ్లైక్యాచర్ తూర్పు ఆసియాకు చెందినదని, చలికాలంలో కఠినమైన వాతావరణాన్ని తట్టుకునేందుకు నవంబర్, డిసెంబర్ నెలల్లో దక్షిణాసియాకు వలసవస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈ పక్షి కేరళ, కర్ణాటక, గోవా, తమిళనాడు, ఒడిశాలో కనిపించినా తెలంగాణలో మాత్రం ఎప్పుడూ కనిపించలేదన్నారు. ఈ పక్షి వేసవిలో కొరియా, మంగోలియా, జపాన్‌లో సంతానోత్పత్తి చేస్తుందని చెప్పారు. తెలంగాణ గడ్డపై కొరియన్ ఫ్లైక్యాచర్‌ను రికార్డ్ చేసిన మొదటి వ్యక్తిగా తాను క్లౌడ్‌నైన్‌లో గుర్తింపు పొందినట్టు తెలిపారు. ఈ ఏడాది నవంబర్‌లో అదే భీమునిపాదం జలపాతం వద్ద మరో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీరామ్‌రెడ్డి 444వ పక్షిగా కనిపించిన స్కేలీథ్రస్ట్‌ను రికార్డ్ చేసిన సంగతి తెలిసిందే.

## కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసు

హైదరాబాద్, డిసెంబర్ 25 ( నమస్తే తెలంగాణ): ర్యాగింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ సైక్ అలీఖాన్‌పై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసి పరీక్షలకు అనుమతి ఇవ్వాలని గతంలో జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేసింది. డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు సైక్ అలీఖాన్ కారణమంటూ కాలేజీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో అలీఖాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ పీజీ పరీక్షలకు అనుమతించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో అలీఖాన్ కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకుమార్ రెడ్డిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు.


